క్లుప్తంగా

ప్రభుత్వ ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ పట్టా


కుంజం శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం: కొయ్యలగూడెం మండలం రాజవరం జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంజం శ్రీనివాస్ కర్ణాటక రాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. ఈ మేరకు యూనివర్సిటీ నుంచి డిక్లరేషన్ పత్రాన్ని ఆయన అందుకున్నారు. తెలుగు మాధ్యమంలో కోయల భాష సాహిత్యం, సంస్కృతిపై ఆయన పరిశోధన చేశారు.

విద్యార్థులకు అభినందనలు


ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కామవరపుకోట: తడికలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జెడ్పీటీసీ కడిమి రమేష్, సర్పంచ్ రజిని శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పాఠశాలకు చెందిన మరీదు హైమా గాయత్రీ దేవి 541 మార్కులు, ధనాని మౌనిక 530 మార్కులు, గంగుల యామిని 525 మార్కులు, గంగుల లోకేష్ 508 మార్కులు సాధించినట్లు హెచ్‌ఎం సర్వేశ్వరరావు తెలిపారు.

వలంటీర్ల రాజీనామాలు


రాజీనామా పత్రాలను చూపుతున్న యర్రంపేట పంచాయతీ పరిధిలోని వలంటీర్లు

కొయ్యలగూడెం: మండలంలోని పలు గ్రామ సచివాలయాలకు సంబంధించిన వలంటీర్లు మంగళవారం రాజీనామాలు సమర్పించినట్లు ఎంపీడీవో అశోక్ కుమార్ పేర్కొన్నారు. గవరవరం పంచాయతీ పరిధిలోని సచివాలయాల నుంచి 17 మంది, రామానుజపురం నుంచి 11 మంది రాజీనామా పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అదేవిధంగా యర్రంపేట పంచాయతీ పరిధిలోని వలంటీర్లు 20 మంది తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు.

ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం


ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

పోలవరం రూరల్: పోలవరం మండలం కోండ్రుకోట పునరావాస కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. చదువులమ్మ తల్లి సోదె అనే విచిత్ర వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఉప్పే మహాలక్ష్మయ్య పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండబారిన పడకుండా ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం


షేక్‌స్పియర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆంగ్ల భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు ప్రఖ్యాత రచయిత విలియం షేక్ స్పియర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. నేటి ఆధునిక యుగంలో రాణించేందుకు ఆంగ్ల భాషా పరిజ్ఞానం అవసరమని, విద్యార్థులు తప్పనిసరిగా ఆంగ్ల భాషపై పట్టు సాధించాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, ధారావతు మల్లేష్, వి.శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 109 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 63 మందికి 60 మంది అభ్యర్థులు హాజరయ్యారని, మరో ముగ్గురు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఎల్ఈడీ 1వ సెమిస్టర్ పరీక్షకు 51 మంది అభ్యర్థులకు 49 మంది హాజరు కాగా ఇరువురు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని తెలిపారు.

జగన్ మరోసారి సీఎం కావాలి




జంగారెడ్డిగూడెం పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం, చింతలపూడి మండలం యర్రంపల్లి గ్రామంలో పార్టీ నేతలతో కలిసి విజయరాజు ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెంలో వైఎస్సార్ సీపీ నేతల ప్రచారం

జంగారెడ్డిగూడెం: సంక్షేమ పాలన నిరంతరం కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పార్టీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో 16వ వార్డులో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, జెట్టి గురునాధరావు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్రతి ఇంటికి ప్రచారానికి వెళుతుంటే ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. జగనన్న పథకాలు మాకు అందరికీ అందాయని, తమ ఓటు వైఎస్సార్ సీపీకే అని స్వచ్ఛందంగా పేర్కొంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలో రూ.14 కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్, ప్రధాన రహదారులు, పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. నేడు పట్టణంలో అభివృద్ధి కనబడుతుందంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌లు కంచర్ల వాసవిరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, మేడవరపు విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి, జెడ్పీటీసీ, జిల్లా ప్రచార కమిటీ కన్వీనర్ పోల్నాటి బాబ్జి, రాష్ట్ర మహిళా కార్యదర్శి తులసి రెడ్డి, బత్తిన చిన్న, కౌన్సిలర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు గెద్దాడ శ్రీనివాసరావు, మైనార్టీ నాయకులు షేక్ అమీర్, కంచర్ల విష్ణు, కర్పూరం నాని, శ్రీనివాసరావు, తాటికుంట్ల రవికుమార్, తాటికుంట్ల నాగలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

కారుమూరి నామినేషన్‌కు తరలిన నేతలు


లింగపాలెంలో బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్ నుంచి నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరిన వైఎస్సార్ సీపీ నేతలు

లింగపాలెం: ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ నామినేషన్ కార్యక్రమానికి మంగళవారం లింగపాలెం మండలం నుంచి వైఎస్సార్ సీపీ నేతలు భారీగా తరలివెళ్లారు. పార్టీ నేత బీవీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఏలూరు నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివెళ్లారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారు మోహన్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, సర్పంచ్‌లు కట్టుబోయిన రమేష్, తాడేపల్లి శాంతారావు, చల్లగొల్ల రవిబాబు, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతారావు, ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు ఇనుగంటి సతీష్, రావి కొండయ్య, బి.ప్రభాకర్ రెడ్డి, కె.ఆనంద్, మండలపు నరసింహారావు తదితరులు వెళ్లారు.

సరిహద్దుల్లో గస్తీని ముమ్మరం చేయండి

ఎక్సైజ్ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ శంకరయ్య


చింతలపూడిలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిప్యూటీ కమిషనర్ శంకరయ్య

చింతలపూడి: ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఎక్సైజ్ సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఎక్సైజ్ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఎం.శంకరయ్య ఆదేశించారు. చింతలపూడి ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టులలో నిరంతరం గట్టి నిఘా నిర్వహించాలని అన్నారు. అక్రమ మద్యం, నాటు సారా, నగదు అక్రమ రవాణా జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని చెప్పారు. అక్రమ మద్యం నిల్వలపై కూడా గట్టి నిఘా పెట్టి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గణపతిబాబు, సీఐ డీఎస్ఎస్‌వీ ప్రసాద్, ఎస్సై పి.లక్ష్మణరావు, మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందిస్తున్న ఈఓ త్రినాధరావు

ద్వారకాతిరుమల: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిన శ్రీవారి దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల విద్యార్థులను, అలాగే పాఠశాల ఉపాధ్యాయులను ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు మంగళవారం అభినందించారు. పాఠశాలకు చెందిన 54 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 50 మంది ఉత్తీర్ణత సాధించారు. 536 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్‌గా నిలిచిన లక్ష్మీపురం గ్రామానికి చెందిన నూర్‌భాషా సమీర, 512 మార్కులు సాధించి స్కూల్ సెకెండ్‌గా నిలిచిన కొమ్మర గ్రామానికి చెందిన రజిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పీవీఏఎం శేషుకుమార్ ఈఓ త్రినాధరావును ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంను, ఉపాధ్యాయులను, విద్యార్థులను త్రినాధరావు ప్రత్యేకంగా అభినందించారు. దేవస్థానం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, బాగా చదువుకోవాలని ఈఓ కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


గూటాలలో ప్రారంభిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం

పోలవరం రూరల్: పోలవరం మండలంలో రబీ సీజన్‌కు సంబంధించి నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పోలవరం, పాత పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. గ్రేడ్–ఎ రకం క్వింటాల్‌కు రూ.2,203, కామన్ రకం రూ.2,183గా ధర నిర్ణయించడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సంచులు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. కోతలు అనంతరం కొనుగోలు కేంద్రాల్లో పేరు నమోదు చేసుకుని సంచులు తీసుకోవచ్చన్నారు. ధాన్యం తరలించేందుకు లారీలను కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, రైతులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.9 లక్షల విరాళం


శ్రీవారి దేవస్థానం ఈఓకు విరాళం చెక్కును అందజేస్తున్న నెక్స్‌జెన్ కంపెనీ యాజమాన్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, బొమ్ములూరుకు చెందిన దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం మంగళవారం రూ.9 లక్షలు విరాళంగా అందజేసింది. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఈ విరాళం చెక్‌ను ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావుకు ఆయన ఛాంబర్‌లో అందించారు. ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యానికి ఈఓ విరాళం బాండ్ పత్రాన్ని అందించి, ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటివరకు ఈ కంపెనీవారు స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1,11,08,007 విరాళంగా అందజేసినట్టు ఈఓ త్రినాధరావు తెలిపారు.

4 నామినేషన్ల దాఖలు


ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న సూర్యచంద్రరావు

బుట్టాయగూడెం: పోలవరం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్ అభ్యర్థిగా మొడియం సూర్యచంద్రరావు రెండు సెట్‌ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం. సూర్యతేజకు అందజేశారు. అదేవిధంగా గోండ్వానా దండకారణ్య పార్టీ నుంచి మడకం వెంకటేశ్వరరావు, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా ఉయికే మంగమ్మ, కాకా కృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ సమయంలో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఐటీడీఏ రిటర్నింగ్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్ ఉపకరణాల చోరీ

టి.నరసాపురం: విద్యుత్ ఉపకరణాలు చోరీకి గురైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన దాకారపు సూరిబాబు, తోట వీరాస్వామినాయుడుకు చెందిన వ్యవసాయ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి రాగి తీగెలు ఆపహరించుకుపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. ఈ ఘటనపై తగు చర్య నిమిత్తం విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయనున్నట్లు చెప్పారు.

గురుకుల కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఉన్న మూడు గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుట్టాయగూడెం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో మొత్తం 155 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిలో 45 ఎంపీసీ, 45 బైపీసీ, 45 హెచ్ఈసీ, 20 ఏఅండ్‌టీ గ్రూప్‌లకు సంబంధించి ఖాళీ ఉన్నాయని అన్నారు. అలాగే కేఆర్‌పురం గురుకుల బాలుర కళాశాలలో 180 సీట్లు ఖాళీగా ఉండగా, ఇందులో ఎంపీసీ 40, బైపీసీ 40, సీఈసీ 40, హెచ్ఈసీ 40, ఏఅండ్‌టి 20 చొప్పున ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అలాగే జీలుగుమిల్లి గురుకుల బాలుర కళాశాలలో 180 సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. వీటిలో 45 ఎంపీసీ, 45 బైపీసీ, 45 సీఈసీ, 45 హెచ్ఈసీ చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ నెల 24 నుంచి మే 15 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకుని దగ్గరలో ఉన్న ఏదైనా గురుకుల విద్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పీఓ కోరారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

కొయ్యలగూడెం: యర్రంపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 11.27 గంటలకు స్వామి వారి విగ్రహాన్ని ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది.

మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో...

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాజ్యలక్ష్మి నామినేషన్ కార్యక్రమం దృష్ట్యా ముందుగా వారు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

జూన్ 29కి జాతీయ లోక్‌అదాలత్ మార్పు

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నుంచి అందిన ఉత్తర్వులు ప్రకారం మే 11వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ జూన్ 29వ తేదీకి మార్పు చేయడం జరిగిందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ తెలియజేశారు. జాతీయ లోక్‌అదాలత్ మార్పు తేదీని గమనించి కక్షిదార్లు తమ కేసులను జూన్ 29 వ తేదీన రాజీ చేసుకొనుటకు సంసిద్ధం కావాలన్నారు.

26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

జంగారెడ్డిగూడెం: సీజీఆర్‌ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన జంగారెడ్డిగూడెం డివిజన్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. చింతలపూడి సబ్ డివిజన్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, స్వతంత్ర సభ్యులు డాక్టర్ రాయసం సురేంద్రకుమార్ హాజరవుతారని, విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

రేపు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ద్వారకాతిరుమల: మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఈఈ జేపీబీ నటరాజన్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఐఎస్ రాఘవాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి గొడుగుపేట గ్రామం వరకు ఆర్ఎస్ఎస్ స్కీమ్ ద్వారా కొత్తగా 11 కేవీ ఫీడర్ వేస్తున్నట్టు చెప్పారు. అందులో భాగంగా ఆరోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐఎస్ రాఘవాపురం, ఐఎస్ జగన్నాధపురం, లక్ష్మీపురం, రామానుజాపురం, గొడుగుపేట గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

పదో తరగతి ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న విద్యావికాస్ యాజమాన్యం


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతిభ పాఠశాల యాజమాన్యం

జంగారెడ్డిగూడెం: అప్‌లాండ్ ఏరియాలోనే విద్యా కేంద్రంగా జంగారెడ్డిగూడెం తన ప్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంది. మరోసారి పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. అత్యధిక మార్కులతో తమ సత్తాను చాటారు.

విద్యావికాస్ విద్యాసంస్థలు

విద్యావికాస్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. కె.అబ్జి 593 మార్కులు, భాస్కర్ జాన్ బెన్‌సన్ 593 మార్కులు, యూవీవీఎన్ఎస్ సీహెచ్ వైశాలి 592 మార్కులు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ పి.సతీష్‌చంద్, కరస్పాండెంట్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఈ స్కూల్‌కు నుంచి 10వ తరగతి హాజరైన విద్యార్థుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరికి 500కు పైగా మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను సతీష్‌చంద్, శ్రీనివాస్‌లతో పాటు, ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, డైరెక్టర్ లక్ష్మీప్రసన్న అభినందించారు.

ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాల

ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయఢంకా మోగించారు. పాఠశాలకు చెందిన సయ్యద్ హర్షాన్ 591 మార్కులు, మహమ్మద్ రేయాన్ అన్సారీ 588, రిథమ్ సాయి 585, అరుణిమ విద్యాశ్రీ, కావ్య హాసిని 584, అర్షియా తబస్సుమ్, హరి స్పందన, అక్షయశ్రీ 583 మార్కులు, హశ్వంత్‌కుమార్ 582, మద్రి శ్రీతన్మయి, తాళ్లూరి శ్రీనివాస్ 581 మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, సుభాష్‌రెడ్డి, సింధూషారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాజ్యలక్ష్మి నామినేషన్

బుట్టాయగూడెం: పోలవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని 7 మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరానున్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో నామినేషన్ కార్యక్రమానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.30 గంటలకు బుట్టాయగూడెం శివాలయం వద్ద నుంచి భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీ శివాలయం నుంచి ప్రారంభం కాగా కంసాలిగుంట, కాపవరం జంక్షన్, నందాపురం, కె.బొత్తప్పగూడెం, ఎస్ఆర్ పాలెం, అచ్చియ్యపాలెం, కండ్రికగూడెం, కన్నాపురం మీదుగా కోటరామచంద్రాపురం చేరుకుంటుంది. అనంతరం అభ్యర్థి రాజ్యలక్ష్మి తన నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బాలరాజు కోరారు.

అన్నప్రసాద వితరణ


అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుందర బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అన్నప్రసాద వితరణ చేశారు. సుమారు 1800 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతలుగా వంకిన నాగ శ్రీనివాస ప్రసాద్, లక్ష్మీచంద్ర పద్మావతి, అవినాష్ సహకరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రంగాపురం సత్యదేవుని సన్నిధిలో...


ఆలయంలో పూజల అనంతరం పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

లింగపాలెం: ఏలూరు వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, తన తండ్రి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుతో కలిసి మంగళవారం రంగాపురం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ నేతలంతా కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, నేతలు రావి కొండయ్య, ఇనుగంటి సతీష్, ఓబిలినేని ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని లారీ దగ్ధం

టి.నరసాపురం: విద్యుత్ స్తంభాన్ని ఢీకొని లారీ దగ్ధమైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఏపిగుంట శివారు గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో భాగంగా లారీలో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో లారీ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్‌వైర్లు లారీపై పడటంతో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే లారీ నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలో లారీ పూర్తిగా దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు.

సవరణ ప్రకటన

ఏలూరు జిల్లా, టి.నరసాపురం మండలం, టి.నరసాపురం [illegible] ... 1.00/- ... 5.00 ... 30,000/- ... 40,000/- ... 5,000/- [illegible]

టి.నరసాపురం
తేది:19-04-2024

